# మీ మాటా, నా మాటా . . .

నేను దేవుణ్ణి కాను. స్వాములవారిని కాను. సదాశివ బ్రహ్మేన్ని కాను. మనిషిని. సామాన్యపు మనిషిని. నాకెవరూ అరటిపళ్ళనూ, అగరు ధూపాలనూ, అమ్మాయిలనూ సమర్పించరు. అంచేత నాక్కావాల్సిన వాటిని నేనే తగు ప్రయత్నంచేసి సంపాదించుకోవాలి. నాకు శారీరక శక్తి, మానసికశక్తి అని రెండు శక్తులున్నాయి. అవసరమైతే ఈ రెంటినీ కూడా సైతానుకు తాకట్టుపెట్టి డబ్బు తేగలను. నేను ఆకలైనప్పుడు అన్నంతింటాను. అన్నంతింటే నాలో అదోరకం మైకం బయల్దేరుతుంది. దాన్ని వొదుల్చుకుందుకు నేను ఇష్టమైన ఆడమ్మాయిలను వెతికి పట్టుకుని, కితకితలుపెట్టి, చిటపటాలాడించి, వాళ్ళతో అనేక రకాలగా ఆడుకుంటాను. నేనిలా చేయడం తలనెరిసిన పెద్దలకెవరికేనా చికాకుగా వుంటే అటువంటి వాళ్లు చావండి.

* * *

ఇదే చెప్పండి ఇన్సూరెన్సు ఏజంట్లందరికీ. నేను భీమా చెయ్యను. చెయ్యనుగాక చెయ్యను. నా ఇంటిచుట్టూ అలా కాలుకాలిన పిల్లుల్లా తిరక్కండి. పట్టా పక్వానికి వచ్చాక లాభాలతో సహా మీరు నాకు డబ్బు ఇవ్వావొద్దు; ఈలోపున నా భార్యాపిల్లల క్షేమంకోసమనీ, ఇన్సూరెన్సు కంపెనీలను మోసంచేయడం కోసమనీ నేను చావనూ అఖ్ఖర్లేదు. ఆ రెండు పద్ధతులుకూడా నాకు అసౌకర్యమే. అయితే, నాకు సౌకర్యంగా వుండే మూడోపద్ధతి చెప్పమంటారా?—పట్టా మొత్తమెంతో అంతా ముందు నా చేతికివ్వండి. ఆ తర్వాత నెలకింత అనో సాలీనా ఇంత అనో లాభాలతో సహా మీరే పుచ్చుకుందురు గాని నా వద్దనుంచి!

* * *

నిన్న నేను లోలాకుల జతకొని... దాని చెవులకు నా చేత్తోటే తగిలించి మురుస్తూండగా ఎంతో ఆనంద పరవశత్వంతో నామీద వాలిపోయి

జా మెళ్ళో అమరధామాన్ని వేసిన ఒకానొక మనిషిని ఈ వేళ సాయంత్రం నేను ఒకగస్తాలో చూడటం జరిగింది. దాని చెవికి నేను తగిలించిన లోలాకులు లేవు. వాటిస్తానే మరో కొత్తరకం లోలాకులు కనిపించాయి. నిర్ఘాతంపోతూ 'ఏమిటీ మార్పు?' అని ప్రశ్నించాను. 'నువ్విచ్చిన లోలాకులజత నువ్వు వెళ్ళగానే తీసేసాను. ఇంకా అదే పెట్టుకూర్చుంటే ఈవేళ ఇంకోహరు ఈజత ఇవ్వడం ఎలా జరిగి వుంటుంది?' అని ఫెడీల్ మని అన్నది. నీతి: మీరు ప్రేమను బజారుమీద కొనుక్కోదలిస్తే రొఖ్ఖమిచ్చి మరీ కొనండి. అంతేగాని లోలాకులతోనూ, తాజమహాళ్ళతోనూ దాని వొంటిమీద స్మారక చిహ్నాలు నిలకొల్పబోయారంటే వాటిని తలుచుకు తలుచుకు మీరే ఏడవాలిగాని ఆ అద్దిమనిషికేం పట్టింది? అది మీకోసమే, మీ స్మారక చిహ్నాలకోసమే పడిగాపులపడి కూర్చునేదయితే బజారుదాకా రాదు. ఈ లోపునే శిష్టులైన కాపులూ, కరణాలూ, రెడ్లూ అంత మంచిదాన్ని దారికాసి అటకాయించేసి వుందురు.

* * *

కుట్టిన తేలును మనం చంపుతూన్నాళ్ళూ ఉరిశిక్షలు అంతరించాలనీ, నరకాన్ని రద్దుచేయాలనీ ఆందోళన చేయడానికి మనకి అర్హత వుండదు. కుట్టిన తేలును చంపకండి. మీరు వీధినపడి గంతులేస్తూ ఏడవనూ ఏడవకండి. దాన్ని చంపితే దానిలోని బుద్ధిహీనతే మీలోనూ వున్నట్టు. మీరు ఏడుస్తే దానిగుండె కరగదు, చాతనైతే పదిమంది లోనూ పెట్టి దాన్ని చడామడా తిట్టండి. ఆదెబ్బతో అది సిగ్గుపడిపోయి మర్నాటినుంచీ మరియెవ్వర్నీ కుట్టడానికి ప్రయత్నించదు.